క్లుప్తంగా

ఈవీఎంలపై అవగాహన



5వ డివిజన్‌లో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 5, 6 డివిజన్లలో బీఎల్‌ఓల ఆధ్వర్యంలో శుక్రవారం ఓటర్లకు ఈవీఎంలపై మొబైల్ వ్యాన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈవీఎంల ద్వారా ఓటు వేయించి తర్వాత వారు వేసిన గుర్తుకు ఓటు పడిందా లేదా అనేది వివరించి ఈవీఎంలపై నమ్మకం కల్గించేలా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు. కార్పొరేటర్ నాగండ్లకోటి, కోలేది రాధా క్రిష్ణ, లగిశెట్టి వెంకటేశ్వర్లు, బీఎల్‌ఓలు అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పువ్వాడ పరామర్శ

ఖమ్మంమయూరిసెంటర్: ఇటీవల మృతి చెందిన నగరంలోని 44వ డివిజన్‌కు చెందిన కార్యకర్త అబ్దుల్ రెహమాన్ కుటుంబాన్ని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు. భార్య ఇమామ్‌బీని ఓదార్చి పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసానిచ్చారు. కార్పొరేటర్ పలెపు విజయవెంకటరమణ, తిరుమలరావు, జాని, కోటి తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ఎస్సీ బాలికల ఏ వసతిగృహంలో వసతిగృహ సంక్షేమ అధికారి నెల్లూరి విజయ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వైద్య శిబిరం నిర్వహించారు. మామిళ్లగూడెం పీహెచ్‌సీ వైద్యుడు వి.సాయి తేజ విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు వివరించి అవసరమైన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ ఐ.వెంకటేశ్వర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్ సీహెచ్ సంధ్యారాణి, ఏఎన్‌ఎం కె.హేమలత, ఆశా వర్కర్లు కె.నాగలక్ష్మి, జి.ఝాన్సీ, వసతిగృహ సిబ్బంది పాల్గొన్నారు.

సుర్దేపల్లి వాసికి అవార్డు

నేలకొండపల్లి: మండలంలోని సుర్దేపల్లికి చెందిన దూత రామకోటేశ్వరరావు మిస్సైల్ మ్యాన్ అవార్డు అందుకున్నారు. ఏపీజే.అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఏపీలోని విజయవాడలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆయనకు అవార్డు అందజేసింది. ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, ప్రెస్ అకాడమీ కార్యదర్శి బాలగంగాధర్ తిలక్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయొద్దు..

ఖమ్మంమయూరిసెంటర్: కళాకారుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా రాష్ట్ర పంచాయతీ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడడం సరికాదని తెలంగాణ వాల్ పెయింటింగ్ ఆర్టిస్ట్ అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్, ఉపేంద్రాచారిలు మండిపడ్డారు. శుక్రవారం నగరంలో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో వారు మాట్లాడారు. టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డిని విమర్శిస్తూ గోడమీద రాతలు రాసుకునేవాడు కోటీశ్వరుడు ఎలా అయ్యాడని మాట్లాడటం వాల్ పెయింటింగ్ కళాకారులను అవమానించడమేనని పేర్కొన్నారు. రాజకీయ కోణంలోనే విమర్శలుండాలని, ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా ఉండకూడదని అన్నారు. గౌరవ సలహాదారులు నాగన్న, భద్రం, షఫీ, శరత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలు ఉపసంహరించుకోవాలి

ఖమ్మంమయూరిసెంటర్: డీఈఓ అనుమతి లేకుండా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్‌ల్లోకి రావడానికి అనుమతి లేదని విద్యాశాఖ డైరెక్టర్ ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వి.వెంకటేశ్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు టి.ప్రవీణ్‌లు వేర్వేరు ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో కూడా ఇలాంటి నిర్ణయాలు చేయలేదన్నారు. వెంటనే ఇలాంటి నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	బేబి
వినోద	బ్రో
సాయిరాం	బ్రో
ఆదిత్య	బ్రో
శ్రీనివాస	బ్రో, స్లమ్‌డాగ్ హస్‌బెండ్(తెలుగు)

- ఖమ్మంగాంధీచౌక్

వరద.. వర్రీ



పద్మావతినగర్ ఓ ఇంట్లో పేరుకుపోయిన బురద

ఇళ్లకు చేరుతున్న మున్నేరు బాధితులు

- వరదతో కూలిన గోడలు, కొట్టుకుపోయిన సామగ్రి
- నీటిపాలైన నిత్యావసరాలు, బియ్యం
- ఆందోళన చెందుతున్న బాధితులు
- వేగం అందుకోని పారిశుద్ధ్య పనులు

ఖమ్మంమయూరిసెంటర్/గాంధీచౌక్: మున్నేరుకు పోటెత్తిన వరద గురువారం రాత్రి నుంచిక్రమంగా తగ్గుముఖం పట్టింది. శుక్రవారం ఉదయం 10 గంటలకు 22 అడుగులకు వరద తగ్గిపోవడంతో నీట మునిగిన ఇళ్లు తేలాయి. దీంతో పునరావాస కేంద్రాలకు వెళ్లిన బాధితులు తిరిగి ఒక్కొక్కరుగా తమ ఇళ్లకు చేరుకుంటున్నారు. ఇళ్లను చూసుకున్న బాధితులు ఎన్నడూ లేని ఈ వరదలు తమను తీవ్రంగా నష్టపరిచాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కట్టుబట్టలతో పునరావాసాలకు..

కొన్ని గంటల వ్యవధిలోనే భారీ వరద చుట్టుముట్టడంతో కట్టుబట్టలతో బాధితులు ఇళ్లకు తాళ్లాలు వేసి బయటకు వచ్చారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు బాధితులందరిని అధికార యంత్రాంగం పునరావాస కేంద్రాలకు తరలించే పనులు చేపట్టగా.. వరద ఉధృతి పెరగడంతో ముంపు బాధితులు తమ ఇళ్లల్లోని సామగ్రి, నిత్యావసరాలు, బియ్యం వంటివి భద్రపరుచుకోకుండానే బయటకు రావడంతో ఆ సామగ్రి అంతా నీటిపాలైంది. దీంతో తడిచిన వస్తువులు, సరుకులను బాధితులు బయట పడేస్తూ.. తినేందుకు గింజలు కూడా లేకుండా పోయాయని, ఇప్పుడు తమ పరిస్థితి ఏంటని ఆవేదన చెందుతున్నారు.



ఇళ్లకు చేరుతున్న బొక్కలగడ్డ బాధితులు

వరద నీరు ఇళ్లల్లోకి చేరడంతో వంట సామన్లు, ఎలక్ట్రికల్ వస్తువులు, ఇతర సామన్లు బురదతో నిండిపోయాయి. ఇంటికి చేరుకున్న బాధితులు వాటిని శుభ్రం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

కూలిన గోడలు.. కొట్టుకుపోయిన సామగ్రి..

ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు గురువారం తెల్లవారుజాము నుంచి మున్నేరు ఉధృతంగా ప్రవహించడంతో నగరంలోని మున్నేరు పరివాహక ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాలైన రామన్నపేట కాలనీ, వెంకటేశ్వరనగర్, పద్మావతి నగర్, బొక్కలగడ్డ, మంచికంటినగర్, కాల్వొడ్డు, మోతీనగర్, పంపింగ్‌వెల్‌రోడ్, ధంసలాపురం కొత్తకాలనీలలో వరద నీరు ఇళ్లల్లోకి చేరింది. వరద ఇళ్ల మధ్య నుంచి ప్రవహించడంతో పలు ఇళ్ల గోడలు ధ్వంసం కాగా గ్యాస్ సిలెండర్లు, బల్లలు, తదితర సామగ్రి వరదకు కొట్టుకుపోయాయి. పద్మావతినగర్, వెంకటేశ్వరనగర్, బొక్కలగడ్డ ప్రాంతాల్లో పలు ఇళ్ల గోడలతో పాటు ఇళ్లపై కప్పులు కూలిపోయాయి.

ప్రారంభం కాని పారిశుద్ధ్య పనులు..

వరద ప్రభావంతో మున్నేరు పరివాహకంలోని లోతట్టు ప్రాంతాల్లోకి బురదతో పాటు వ్యర్థాలు చేరాయి. బాధితులు ఇళ్లల్లోకి చేరిన వ్యర్థాలు, బురదను తొడి రోడ్లపై పోస్తున్నారు. అయితే ఈ వ్యర్థాలను, బురదను తొలగించేందుకు పలు కాలనీల్లో పారిశుద్ధ్య పనులను కేఎంసీ అధికారులు ప్రారంభించలేదు. బురదతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా కనీసం బ్లీచింగ్ కూడా చల్లించడం లేదని వరద బాధిత ప్రాంతాల వాసులు ఆవేదన చెందుతున్నారు. వెంటనే వరద నీరు చేరిన కాలనీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, నీటి సరఫరా చేయించాలని కోరుతున్నారు.

నిత్యావసరాలు నీటిపాలు..



మున్నేరుకు వరద పెరుగుతుందని చెప్పడంతో సామన్లు ఏమీ సర్దుకోకుండానే పునరావాస కేంద్రాలకు వెళ్లాం. వరద తగ్గిన తర్వాత ఇంటికి వచ్చి చూసుకుంటే ఇంట్లోని సామగ్రి తడిచిపోయింది. తినేందుకు కొనుకొన్న రెండు క్వింటాళ్ల బియ్యం నీటి పాలైంది.

– దేవరకొండ శ్రీనివాస్, పద్మావతినగర్‌వాసి

ఇల్లంతా బురదమయం..



మున్నేరు వరద ఇంట్లోకి చేరడంతో బురదమయంగా మారింది. వంట సామన్లు, కూలర్లు, టీవీ, మంచాలు, ఇతర వస్తువులు అన్నీ బురద మట్టి పేరుకపోయాయి. వీటిని శుభ్రం చేసుకునేందుకు నీరు లేక.. మోటార్లు వేసుకుందామంటే కరెంటు లేక నానా ఇబ్బంది పడుతున్నాం.

– చలమల లక్ష్మి, వెంకటేశ్వరనగర్

హఠాత్తుగా వరద చేరింది..



వరద వస్తుందని అధికారులు ఎవరూ ముందస్తు హెచ్చరికలు చేయలేదు. ఇళ్ల వద్దకు వరద నీళ్లు హఠాత్తుగా చేరిన తర్వాత ఖాళీ చేయాలని చెప్పడంతో కట్టుబట్టలతో బయటకు వచ్చాం. ఒక్కసారిగా వచ్చిన వరదతో కాలనీ వాసులంతా తీవ్రంగా నష్టపోయారు.

– పి.మహేశ్వరరావు, మంచికంటినగర్

ఇంటి పైకప్పు కూలిపోయింది..



మున్నేరు వరదతో మా ఇంటి పైకప్పు కూలిపోయింది. పెంకులు వరద నీటికి కొట్టుకపోయాయి. మున్నేరు వరద నాకు గూడు కూడా లేకుండా చేసింది. వరదతో ఇంటిలోని సామానంతా తడిచిపోయింది. ఇప్పుడు తలదాచుకునేందుకు నీడ కూడా లేకుండా పోయింది.

– పి.లక్ష్మి, బొక్కలగడ్డ

నోటిలో మట్టి కొట్టింది..



ప్రభుత్వం ఇచ్చే ఆసరానే నాకు ఆధారం. ఇంటిలో ఉన్న పప్పులు, నూనె, గ్యాస్, బియ్యం, బట్టలు అన్ని బురదమయం అయ్యాయి. తినేందుకు గింజలు లేకుండా పోయ్యాయి. వరద నీరు వచ్చి నా నోటిలో మట్టికొట్టి పోయింది.

– బానోత్ వీరమ్మ, బొక్కలగడ్డ

సహాయక చర్యలు.. పర్యవేక్షణలు..

వరద బాధితులకు అన్నదానం..



నయాబజార్ పాఠశాలలో అన్నదానం చేస్తున్న తోట రామారావు దంపతులు



ఖమ్మం మామిళ్లగూడెం: ఇంటింటికి భోజనం, టిఫిన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంమామిళ్లగూడెం: మున్నేరు వరదతో పునరావాస కేంద్రాలకు తరలిన బాధితులకు గత రెండు రోజులుగా కేఎంసీ ఆధ్వర్యంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందజేస్తున్నారు. ఇక 48వ డివిజన్ కార్పొరేటర్ తోట గోవిందమ్మ, మాజీ కార్పొరేటర్ తోట రామారావు ఆధ్వర్యంలో నయాబజార్ పాఠశాలలో ఉన్న వరద బాధితులకు ఉన్నన్ని రోజులు మూడు పూటల భోజనం అందిస్తున్నారు. అదే విధంగా వర్షాలకు ఇళ్లు కూలి పోయిన నిరాశరులైన నగరంలోని 47వ డివిజన్ వెంకటేశ్వరనగర్‌కు చెందిన వరద బాధితులకు జమాతే ఇస్లామి హింద్ ఖమ్మం వన్ టౌన్, టూటౌన్, త్రీటౌన్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటికి టిఫెన్‌తో పాటు భోజనం, మినరల్ వాటర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా టౌన్‌ల అధ్యక్షులు అబ్దుల్ మల్లిక్, అబ్రార్‌అలీ, షేక్.రఫీతో సభ్యులు సుబూర్, సమీ, జైనుల్ పాషా, అజీజ్, నిజాముద్దీన్, గపూర్, అమేర్ తదితరులు పాల్గొన్నారు.

వద్దిరాజు సేవా సమితి ఆధ్వర్యంలో..



బాధితులకు బియ్యం అందజేస్తున్న సమితి సభ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: 48వ డివిజన్‌లో సుమారు 100 మంది బాధిత కుటుంబాలకు వద్దిరాజు సేవా సమితి ఆధ్వర్యంలో.. ఒక్కొక్కరికి 25 కిలోల బియ్యం అందజేశారు. స్థానిక కార్పొరేటర్ తోట గోవిందమ్మ, మాజీ కార్పొరేటర్ తోట రామారావు సమక్షంలో రవిచంద్ర అభిమానులు బాధిత కుటుంబాలను కలిసి.. వారికి ధైర్యం చెప్పి బియ్యం బస్తాలు అందజేశారు.

నీట మునిగిన పంటలను పరిశీలించిన ఏడీఏ



పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ, ఏఓ

కూసుమంచి: మండలంలోని పలు గ్రామాల్లో వరదలకు నీట మునిగిన పంటలను శుక్రవారం కూసుమంచి ఏడీఏ విజయచంద్ర, ఏఓ వాణి పరిశీలించారు. నర్సింహులగూడెం, మల్లాయిగూడెం, హట్యాతండా గ్రామాల్లో నీటమునిగి ఇసుక మేటవేసిన పొలాలలను పరిశీలించి తగు సూచనలు చేశారు. పొలాల్లో అధికంగా నీరు నిల్వ ఉంటే బయటకు పంపించాలన్నారు. సర్పంచ్‌లు జక్కుల వెంకటేశ్వర్లు, బదీవత్ బీబ్లీ, ఏఈఓలు ప్రియాంక, సౌమ్య, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు ప్రారంభించాం:మేయర్



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మేయర్

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పనులు ప్రారంభించినట్లు మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. శుక్రవారం కాల్వొడ్డు ప్రాంతంలో రోడ్లపైకి చేరిన మురుగును వాటర్ ట్యాంకుల ద్వారా రోడ్లను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ బచ్చు విజయకుమార్, డిప్యూటీ కమిషనర్ మల్లీశ్వరి, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కన్నం ప్రసన్న కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'అల్లిక' పరామర్శ..



బాధితులతో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఖమ్మంరూరల్: భారీ వర్షాలకు సర్వం కోల్పోయి రాంలీల ఫంక్షన్‌హాల్ పునరావాస కేంద్రంలో ఉంటున్న వరద బాధిత కుటుంబాలను బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు అల్లిక వెంకటేశ్వరరావు శుక్రవారం పరామర్శించారు. ఈమేరకు బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని అడిగి తెలుసుకుని మాట్లాడారు. ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకొని ఉంటే ఇంత భారీ నష్టం జరిగి ఉండేది కాదని, ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదికన మున్నేరుకు కరకట్ట నిర్మించాలని పేర్కొన్నారు.

పాలేరు నుంచి నిలిచిపోయిన తాగు నీటి సరఫరా..

కూసుమంచి: పాలేరు రిజర్వాయర్ నుంచి కూసుమంచి మండలానికి అందించే తాగునీటి సరఫరాను అధికారులు శుక్రవారం నిలిపివేశారు. రిజర్వాయర్‌కు భారీగా వరద పోటెత్తడంతో తాగు నీటిని సరఫరా చేసే ఇన్‌టేక్‌వెల్ పవర్‌యార్డులోకి నీరు చేరడంతో మోటార్లను నిలిపివేశారు. యార్డ్‌లోని నీరు తగ్గిన తరువాత నీటిసరఫరాను పునరుద్ధరిస్తామని, అప్పటి వరకు గ్రామాల్లో సర్పంచ్‌లు, కార్యదర్శులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని మిషన్ భగీరథ అధికారులు కోరారు.



నయాబజార్ కళాశాల పునరావాస కేంద్రంలో భోజనం చేస్తున్న కలెక్టర్ వీ.పీ. గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్, తదితరులు

గ్రామాల్లో ముమ్మరంగా డ్రైడే



నేలకొండపల్లి: చెరువుమాధారంలో డ్రైడే పనులను పరిశీలిస్తున్న మెడికల్ ఆఫీసర్



రఘునాథపాలెం: రేగులచలకలో గాబులో నిల్వనీటిని తొలగిస్తున్న దృశ్యం

నేలకొండపల్లి/రఘునాథపాలెం: మండలాల్లోని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం డ్రైడే పనులు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ఇంటింటికి వెళ్లి నివాసాల్లో పాత గాబులు, రోళ్లు, టైర్లు, కొబ్బరి బొండాల్లో నిల్వ నీరు తొలిగించి దోమలు దరిచేరకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. డ్రెయిన్లు, తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయించి బ్లీచింగ్, క్లోరినేషన్ చేయించారు. కాగా నేలకొండపల్లి మండలంలోని చెరువుమాధారంలో మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.శ్రావణ్‌కుమార్ డ్రైడే -ఫ్రైడే పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో ఆరోగ్య క్యాంపులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈవూరి సుజాత, ఉప సర్పంచ్ ఆకుల వెంకటేశ్వర్లు, హెచ్‌ఈఓ చంద్రశేఖర్, ఏఎన్‌ఎంలు జ్యోతి, శ్రీదేవి, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

ఖమ్మం సహకారనగర్: ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యాన శుక్రవారం గూగుల్ మీట్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా భూమికి మానవునికి మధ్య సామరస్యతే ప్రకృతి పరిరక్షణ' అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. పద్మావతి మాట్లాడగా.. గూగుల్ మీట్‌లో సూర్యాపేట డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ వేమూరి సతీష్‌కుమార్, పోట్ల కృష్ణవేణి, అకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ పెండ్యాల రాజిరెడ్డి పాల్గొన్నారు.

కత్తిపోట్లు.. ఒకరి పరిస్థితి విషమం


ఖమ్మంక్రైం: ఖమ్మం వీడీఓస్ కాలనీలో ఇద్దరి నడుమ చిన్నగా మొదలైన ఘర్షణ చినికిచినికి గాలివానలా మారి కత్తిపోట్లకు దారి తీసింది. కాలనీలో హన్మంతరావు, తిరుమలరావు పక్కపక్క ఇళ్లలోనే నివాసముంటారు. శుక్రవారం రాత్రి వీరి మధ్య చిన్న వివాదం మొదలై ఘర్షణకు దారితీసింది. ఈమేరకు కోపంతో తిరుమలరావు హన్మంతరావుపై కత్తితో దాడిచేయటంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆయనను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా, పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

ప్రభుత్వం దిగొచ్చే వరకూ సమ్మె..

నేలకొండపల్లి: పంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం వైఖరి వీడాలని సంఘం జిల్లా నాయకుడు వంగూరి నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం సెమ్మె 23వ రోజుకు చేరగా.. పొట్టిశ్రీరాముల సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సమస్యల పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం దిగొచ్చే వరకూ సమ్మె కొన సాగుతుందన్నారు. తాము గొంతెమ్మ కొర్కెలు కోరటం లేదని.. న్యాయమైన కోర్కెలు, కనీస వేతనాల చట్టంను అమలు చేయాలని కోరుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల నాయకులు రహిముతుల్లా, బొడ్డు అంజనేయులు, బుచ్చిరాములు, కాస్తల గోపయ్య, వెంకటేశ్వర్లు, అనిత తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు సంఘీభావం..

తిరుమలాయపాలెం: గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెకు ఎంఎస్‌పీ పాలేరు ఇన్‌చార్జ్ చింతిరాల నాగభూషణం శుక్రవారం సంఘీభావం తెలిపారు. కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ నాయకులు పగిడిపల్లి బాబుమాదిగ, మధు మాదిగ, బత్తిని సీతారాములు మాదిగ, వంగూరి వెంకన్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న కార్మికులు

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురం తండాకు చెందిన పలు కుటుంబాలకు టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు అందించిన ఆర్థిక సాయాన్ని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం బాధితులకు అందించారు. ఇటీవల మృతి చెందిన దినేష్ నాయక్ కుటుంబానికి రూ.10 వేలు, భూక్యా సాయమ్మ కుటుంబానికి రూ.5 వేలతో పాటు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ భూక్యా శంకర్‌కు వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు భూక్యా చిన్న నాయక్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు దీరావత్ రాధాకృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీ భూక్యా శ్రీరాములు, యువజన నాయకులు యడవల్లి నాగరాజు, ధనవత్ సంతోష్, హేమ్లా, కోటేశ్వరరావు, వెంకట్, రామోజీ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కూసుమంచి: వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అధికారులు, పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ బానోత్ శ్రీనివాస్‌నాయక్ కోరారు. శుక్రవారం నిర్వహించిన మండల పరిషత్ ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. దోమలు ప్రబలకుండాఫాగింగ్ చేపట్టాలని, డెంగీ నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డితో పాటు పలుశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

తిరుమలాయపాలెం: మండలంలోని తాళ్లచెరువు, జూపెడ గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన పలు కుటుంబాలను పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పరామర్శించారు. మాజీ ఎంపీటీసీ వాలూరి దామోదర్ తండ్రి నారాయణ ఇటీవల మృతిచెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించారు. జూపెడ సర్పంచ్ మోహినమ్మ అత్తగారు మైసమ్మ ఇటీవల మృతిచెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమాలలో ఎంపీపీ మంగీలాల్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బాషబోయిన వీరన్న, సర్పంచ్‌లు దేవేందర్‌రెడ్డి, మోహినమ్మ పాల్గొన్నారు.

వరద తెచ్చిన తంటాలు..

మండలాల్లోని పలు గ్రామాల్లో చెరువులు, వాగుల నుంచి వచ్చే వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. ఈనేపథ్యంలో పలు గ్రామాల మధ్య రాకపోకలు బంద్ చేయడంతో పాటు వరదకు కొట్టుకొచ్చిన చెట్ల కొమ్మలు, వ్యర్థాలను జేసీబీ సాయంలో తొలగించే పనులు గ్రామ పాలకులు చేపట్టారు. కాగా, వరద ఉధృతికి వరి, పత్తి, మిర్చి తోటల్లో ఇసుక మేటలు వేయగా.. పలు చోట్ల రోడ్లు ధ్వంసం అయ్యాయి. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా త్వరగా పారిశుద్ధ్య చర్యలు అధికారులు చేపట్టారు. – సాక్షి నెట్‌వర్క్



తిరుమలాయపాలెం: నామ రూపాలు లేని వరినాట్లు



మున్నేరు వరదను పరిశీలిస్తున్న మంత్రి అజయ్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం



కూసుమంచి: నాయకన్‌గూడెంలో మట్టి కోత



ఖమ్మంరూరల్: కేబీఆర్‌నగర్ వీధుల్లో బురద



బొక్కలగడ్డలో సామన్లను శుభ్రం చేస్తూ..



రఘునాథపాలెం: పాపటపల్లి-వీఆర్‌బంజర మధ్య బుగ్గవాగులో కొట్టుకొచ్చిన చెట్లను తొలిగిస్తూ..



ఆటోనగర్‌లో వరదకు కొట్టుకొచ్చిన కార్లు



నేలకొండపల్లి: నీట మునిగే ఉన్న పంట పొలాలు